అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 06 మార్చి 2023

నేల ఆరోగ్యంపై విద్యార్థుల అధ్యయనం

కౌటాల : రాష్ట్రీయ ఆవిష్కార్ వారోత్సవాల్లో భాగంగా నేల ఆరోగ్యంపై విద్యార్థులు అధ్యయనం చేశారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 6, 7వ తరగతి విద్యార్థులు ఆదివారం పలు రకాల నేలల మట్టిని సేకరించి అధ్యయనం చేశారు. నేల ఆమ్ల, క్షార స్వభావాన్ని కలిగి ఉంటుందని, నేల నీటిని తట్టుకొనే సామర్థ్యాన్ని వివిధ రకాల ప్రయోగాలు చేసి ఆరోగ్యాన్ని కృత్యాల ద్వారా వివరించారు. దీనిని బట్టి రైతులు ఏఈఓలతో భూసార పరీక్షలు చేయించుకొని దానికి తగిన పంటను వేసుకుంటే నష్టపోకుండా ఉంటుందన్నారు. విద్యార్థుల వెంట సైన్స్ ఉపాధ్యాయురాలు సంతోషి, రేఖ, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం రమేష్ ఉన్నారు.



జిల్లాస్థాయి కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలు ప్రారంభం

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని ఆదివాసీ భవనంలో జిల్లా కుంగ్ ఫు డు అండ్ డ్రంకన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి కుంగ్ ఫు కరాటే ఓపెన్ ఛాంపియన్షిప్ పోటీలను జడ్పీ చైర్ పర్సన్ కోవ లక్ష్మి, జెడ్పిటిసి నాగేశ్వరరావుతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఎదుగుదలకు కరాటే తోడ్పడుతుందన్నారు. విద్యలో మెలకువలు నేర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, కుంగ్ ఫు జిల్లా ప్రెసిడెంట్ కె సంతోష్, చీఫ్ ఆర్గనైజర్స్ కె అంజన్న, రాజశేఖర్, జిల్లా కోచ్‌లు ఎం.నాగయ్య, ఎస్.బాలకిషన్, డి అరుణ్, ప్రసాద్, బూర్గుడ మాజీ సర్పంచ్ సత్యనారాయణ విద్యార్థులు పాల్గొన్నారు.



జైనూర్ ప్రభుత్వాస్పత్రికి

వైద్యులు కావలెను..!

- 30 పడకల ఆస్పత్రిలో ఒకేఒక వైద్యుడు
- వైద్యసిబ్బందీ అరకొరే..
- వృథాగా ఎక్స్‌రే, సోనోగ్రఫీ మిషన్లు

గిరిజనులకు నాణ్యమైన విద్యా, వైద్యం అందిస్తామని పాలకులు పదేపదే చెబుతుంటారు. కానీ జైనూర్, సిర్పూర్(యు), లింగాపూర్ మండలాల గిరిజనులకు వైద్యమందించే జైనూర్ ప్రభుత్వాస్పత్రి అధ్వాన్న స్థితిలో ఉంది. ఒకప్పుడు చిన్న బిల్డింగ్ ఉన్న 30 పడకల ఆస్పత్రికి నూతన బిల్డింగ్ ఏర్పాటు చేసినా సరిపడా వైద్యులు, సిబ్బంది లేక సేవలు మృగ్యంగా మారాయి. ఆస్పత్రికి రోజూవారీగా మూడు మండలాలకు చెందిన ప్రజలు సుమారు 300 వరకు వస్తుంటాయి. కానీ ఒక్కరే వైద్యాధికారిగా కొనసాగుతున్నారు. 30 పడకల ఆస్పత్రిలో కనీసం ఏడుగురు డాక్టర్లు ఉండాల్సి ఉండగా ఒక్కడితో సేవలు ఏవిధంగా అందుతున్నాయో అర్థం చేసుకోవచ్చు. వైద్య సిబ్బంది సైతం అరకొరగానే ఉంది. ఐదారుగురు ఏఎన్ఎంలతో నెట్టుకొస్తున్నారు.

నవతెలంగాణ - జైనూర్

మారుమూల ఏజెన్సీ మండలాలకు కేంద్ర బిందుగా ఉన్న జైనూర్ మండల కేంద్రంలో ఉన్న 30 పడకల ఆస్పత్రిలో వైద్యులు, సిబ్బంది కొరత వేధిస్తోంది. బిల్డింగ్‌తో పాటు అన్ని సౌకర్యాలున్నా ఈ ఆస్పత్రిలో వైద్యులు లేక గిరిజనులకు వైద్య సేవలందడ లేదు. 30 పడకల ఆస్పత్రిలో కనీసం ఏడుగురు వైద్యులు అందుబాటులో ఉండాలి. అంతేకాదు అన్ని రకాల స్పెషలిస్టులు ఉండాల్సి ఉంది. ఆస్పత్రిలో ఎక్స్‌రే మిషన్, సోనోగ్రఫీ పరికరాలున్నా సిబ్బంది లేకపోవడంతో ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కు వెళ్లాల్సి వస్తోంది.

సోనోగ్రఫీ కోసం ఆదిలాబాద్‌కు..

రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు వైద్యపరంగా అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నామని చెబుతున్నా జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో గర్భిణులు, బాలింతలకు వైద్య సేవలందడం లేదు. నెలకొకసారి నిర్వహించే సోనోగ్రఫీ కోసం ఆదిలాబాద్ పాత జిల్లాకు వెళ్లాల్సిందే. ఇక్కడ మెరుగైన వైద్యం కోసం సోనోగ్రఫీ సెంటర్‌ను ప్రారంభించారు. గతంలో ఆదివారం మండల వారీగా పంచాయతీల్లో పేర్లు నమోదు చేసి అదే గ్రామ పంచాయతీలో గర్భిణులకు సోనోగ్రఫీ కోసం తీసుకొస్తుండేవారు. కానీ కొన్ని నెలల నుండి రిమ్స్ నుండి వచ్చే వైద్యాధికారి రాకపోవడంతో లక్షలాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన సోనోగ్రఫీ మిషన్లు వృథాగా పడి ఉన్నాయి. చేసేది లేక గర్భిణులు ప్రతినెల చెకప్ కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రానికి అవస్థలు పడుతూ వెళ్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పదేపదే ప్రతి మహిళా ప్రసూతి కోసం ప్రభుత్వ ఆస్పత్రికి రావాలని ప్రచారం చేస్తోంది. కానీ ఈ ఆస్పత్రికిలో టార్గెట్ కన్నా చాలా ఎక్కువ ప్రసవాలు జరుగుతున్నాయి. 30 పడకల ఆస్పత్రిలో గైనకాలజిస్టు లేకపోయినా అనుభవం ఉన్న ఏఎన్ఎంల ద్వారా నెలకు 30 నుండి 40 వరకు నార్మల్ డెలవరీ కేసులు నమోదవుతున్నాయి. ఆశా వర్కర్లు, ఫీల్డ్ ఏఎన్ఎంలు ఆస్పత్రి సిబ్బంది సహకారంతో ప్రసవాలు కొనసాగుతున్నాయి. ఒకవేళ గైనకాలజిస్టు ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంటే మరిన్ని ప్రసూతి కేసులు పెరిగే అవకాశాలుంటాయి. మండల నుండి ప్రభుత్వ ఆస్పత్రిలో కనీసం రౌండ్ ద క్లాక్ డ్యూటీలో భాగగా ఏడుగురు వైద్యులను కొనసాగించాలని పదేపదే ప్రభుత్వానికి నివేదికలు అందుతున్నా పాలకులు దృష్టి సారించడం లేదు.

పీహెచ్‌సీ సీహెచ్‌సీగా మారాలంటే..

మండల కేంద్రంలోని పీహెచ్‌సీని సీహెచ్‌సీగా మార్చాలనే ఉద్దేశంతో 30 పడకల ఆస్పత్రి కోసం భవనం ఏర్పాటు చేశారు. వైద్య విధాన పరిషత్ ద్వారా నూతన వైద్యాధికారులను నియమిస్తారు. సీహెచ్‌సీగా కొనసాగాలంటే వైద్య విధాన పరిషత్ ద్వారా పర్యవేక్షించి కావాల్సిన వైద్యాధికారులను అందజేస్తారు. కానీ జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో బిల్డింగ్ ఉన్నా పీహెచ్‌సీగానే ఉంది. పీహెచ్‌సీలో పని చేసే వైద్యాధికారులు, వైద్యసిబ్బంది కొనసాగుతున్నారు. జైనూర్, కాగజ్‌నగర్, వాంకిడి, తిర్యాణి, కౌటాల లాంటి మండలాలకు సుమారు ఐదు సీహెచ్‌సీలు మంజూరైనట్టు అధికార వర్గాల సమాచారం. కానీ జైనూర్ ప్రభుత్వ ఆస్పత్రిలో 30 పడకలున్నా పీహెచ్‌సీ వైద్యులే కొనసాగుతున్నారు. పేద గిరిజనులకు నాణ్యమైన వైద్యం అందాలంటే సరిపడా వైద్యులను, సిబ్బందిని నియమించాలని మూడు మండలాల గిరిజనులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.





ఆస్పత్రి అభివృద్ధికి కృషి చేస్తా : రామకృష్ణ, జిల్లా వైద్యాధికారి

మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడానికి తన వంతు కృషి చేస్తా. జిల్లా ప్రజలకు సేవ చేయడానికి జిల్లా వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించాను. జిల్లాలోని వైద్యుల ఖాళీలను గుర్తించి, వివరాలను ప్రభుత్వానికి అందజేసి ఆస్పత్రిలో నాణ్యమైన వైద్యం అందించేందుకు కృషి చేస్తాను. ప్రజాప్రతినిధుల సహకారంతో గిరిజనులకు ఉన్నత స్థాయి వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తాను.

ఖాళీ సిలిండర్లతో కాంగ్రెస్ నిరసన



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థకు కొమ్ము కాస్తూ ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిందని డీసీసీ అధ్యక్షుడు సాజిద్ ఖాన్, ఏఐసీసీ సభ్యురాలు గండ్రత్ సుజాత ఆరోపించారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలను భారీగా పెంచడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని రైతుబజార్ వద్ద ఖాళీ గ్యాస్ సిలిండర్లతో నిరసన తెలిపారు. ఖాళీ గ్యాస్ సిలిండర్లను రిక్షా మీద తీసుకెళ్తూ కేంద్రం వైఖరిని ఎండగట్టారు. గ్యాస్‌తో పాటు నిత్యావసర సరకుల ధరలు సైతం ఆకాశాన్ని తాకుతున్నాయని నాయకులు పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిస్థాయిలో విఫలమైందని ఆరోపించారు. ప్రతి పేద వాడి బ్యాంకు ఖాతాలో 15 లక్షలు వేస్తామని ఇచ్చిన హామీ కేవలం మాటలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా స్పందించి నిత్యావసరాల ధరలను అదుపులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శి వెడ్మ బొజ్జు, నాయకులు సంజీవరెడ్డి, నగేష్, రాహుల్, రాజు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదాన్ని ఎదుర్కొంటాం



నవతెలంగాణ- మంచిర్యాలటౌన్

స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ విప్లవ కెరటాలుగా నిలిచారని, అలాంటి మహనీయుల స్ఫూర్తితో మతోన్మాదాన్ని ఎదుర్కొందామని డివైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి గోడిసెల కార్తీక్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం రాజ్ కుమార్, ఎ మహేష్ అన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బ్రిటిష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాటం చేసి యువతకు దిక్సూచిగా ఉన్నారన్నారు. దేశంలో రోజురోజుకు మతోన్మాదం పేరుతో దాడులు పెరుగుతున్నాయని, రక్షణ ఉండడం లేదని తెలిపారు. మతోన్మాదాన్ని ఎదుర్కోవడానికి భగత్‌సింగ్ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగుతామని తెలిపారు. యువత మతోన్మాదంపై పోరాటం సాగించాలన్నారు. అందరికీ విద్య, ఉపాధి, ఉద్యోగం ఇస్తామని బిజెపి ప్రభుత్వం యువతకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థలలో ఉద్యోగాలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. పెంచిన నిత్యావసరాలు, పెట్రో, గ్యాస్ ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో డివైఎఫ్ఐ జిల్లా నాయకులు కె.ప్రేమ్‌కుమార్, రమేష్ పాల్గొన్నారు.

రక్షణ ఉత్పత్తి, ఉత్పాదకతపై సమీక్షా సమావేశం



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ సంజీవరెడ్డి అధ్యక్షతన సిసిసిలోని ఆఫీసర్స్ క్లబ్‌లో ఆర్కే 5 గని అధికారులు సూపర్‌వైజర్లతో రక్షణ ఉత్పత్తి, ఉత్పాదకతపై ఆదివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ మేనేజర్ మాట్లాడుతూ ఆర్కే 5 గని నెల రోజులు ముందుగానే 2022-23 ఆర్థిక సంవత్సర ఉత్పత్తి లక్ష్యాన్ని సాధించడం చాలా సంతోషకరమన్నారు. దీనికి తోడ్పడిన గని ఏజెంట్ ఏవీ రెడ్డి, మేనేజర్ అబ్దుల్ ఖాదర్, గని ఉద్యోగులందరూ అభినందనీయులని, రక్షణ విషయంలో కూడా గని తీసుకుంటున్న రక్షణ చర్యలు బాగున్నాయని తెలిపారు. సింగరేణి వ్యాప్తంగా గ్రూపు గనులలో ఆర్కే 5, 6 గనులు మాత్రమే 100 శాతం ఉత్పత్తిని సాధించాయని జనరల్ మేనేజర్ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో ఏజెంట్ ఏవీ రెడ్డి, గని మేనేజర్ అబ్దుల్ ఖాదర్, ఆర్కే 6 గని మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి శివయ్య, గని గ్రూప్ ఇంజనీర్ వీరన్న, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో ప్రజావాణి

నవతెలంగాణ-తాండూర్

ప్రతి సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని సౌలభ్యం కోసం తహసీల్దార్ కార్యాలయానికి మార్చినట్లు ఎంపీడీవో ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఎన్ఆర్ఈజీఎస్ తనిఖీ బృందం విధులు నిర్వర్తిస్తున్నందున ఈ నిర్ణయం తీసుకున్నామన్నారు. మండల ప్రజలు గమనించాలని కోరారు.

ప్రజాస్వామ్య రక్షణకు ఉద్యమించాలి

నవతెలంగాణ- మంచిర్యాలటౌన్

తెలంగాణ బిడ్డల ఆకాంక్షల మేరకు తెలంగాణ రాష్ట్రంలో ప్రజాస్వామిక వ్యవస్థలను కాపాడుకోవాలని వివిధ సంఘాల నాయకులు పేర్కొన్నారు. తెలంగాణ సోషల్ మీడియా ఫోరం ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో జరిగిన 'వెంటిలేటర్‌పై ప్రజాస్వామ్యం' అంశంపై సదస్సులో ప్రసంగించారు. ప్రజలు పోరాడి సాధించుకున్న తెలంగాణ నేడు దొరల వశమైందని వక్తలు ఆవేదన వెలిబుచ్చారు. నిర్వాసితులు, రైతులు, యువజనుల ఆకాంక్షలను పాలకులు పట్టించుకోవడం లేదంటు విమర్శించారు. స్వరాష్ట్రంలో విద్యా రంగం బాగుపడుతుందని ఆశిస్తే విద్యాలయాలు మూతపడి ప్రజలకు విద్య దక్కకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు మనువాద మతోన్మాద శక్తులు అధికారంలోకి వస్తే ప్రజాస్వామ్యానికి పూర్తి ప్రమాదం ఏర్పడుతుందని పేర్కొన్నారు. మఖ్దూమ్ మొహినుద్దీన్, చాకలి ఐలమ్మ, దొడ్డి కొమరయ్యలు పోరాడిన వీర తెలంగాణ మనువాద మతోన్మాద శక్తుల పరం కాకుండా ప్రతి ఒక్కరూ ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాది నిరూప్, సీనియర్ జర్నలిస్ట్ పాశం యాదగిరి, తెలంగాణ సోషల్ మీడియా ఫోరం అధ్యక్షుడు కరుణాకర్ దేశాయి, ప్రజాస్వామ్య ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీమన్నారాయణ, బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వరరావు, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బహుజన ఐక్యవేదిక నాయకులు పలిగిరి కనక రాజు, బీసీ ఐక్యవేదిక నాయకులు కనుకుంట్ల మల్లయ్య, సామాజిక ఉద్యమకారులు మోతె జయకష్ణ, కైలాసం, దుర్గం ఎల్లయ్య, ఇబ్రహీం పాల్గొన్నారు.



ప్రీతి కుటుంబానికి న్యాయం చేయాలి



నవతెలంగాణ-నార్నూర్

సీనియర్ వేధింపులకు తట్టుకోలేక వరంగల్ ఎంజీఎంలో ఆత్మహత్య చేసుకున్న పీజీ వైద్య విద్యార్థిని దారావత్ ప్రీతి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రజాప్రతినిధులు, యూత్ సభ్యులు, ఉద్యోగ వ్యాపార సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో గాంధీ చౌక్ నుంచి అంబేద్కర్ చౌక్ వరకు క్యాండిల్ వెలిగించి ర్యాలీ నిర్వహించారు. ప్రీతి ఆత్మహత్యకు కారకులైన వారికి కఠినంగా శిక్షించాలని మౌనం పాటించి నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వివిధ యూత్ సంఘాల సభ్యులు రవీందర్, శుభం వాగ్మారే, జాదవ్ జితేందర్, కల్వలే రాజేశ్వర్, సిడాం కైలాష్, రాథోడ్ ఈశ్వర్, సూర్యవంశీ శశాంక్, సర్వదే రాహుల్, ఈరాళ్లే గోపాల్, వైస్ ఎంపిపి చంద్రశేఖర్, ఉపసర్పంచ్ విష్ణు ఫడ్, వైద్యులు రాథోడ్ రవికిరణ్, రాథోడ్ సందీప్, మార్కెట్ కమిటీ సభ్యులు కోటగిరి విశాల్, ఉపాధ్యాయ సంఘం నాయకులు శ్రీనివాస్, జాదవ్ ఆనంద్ రావ్, కిషోర్ పాల్గొన్నారు.

సీఎం దృష్టికి ఉద్యోగుల సమస్యలు

- ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనంలో అడ్డి భోజారెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ఎమ్మెల్యే జోగు రామన్న ద్వారా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోయే ప్రయత్నం చేస్తానని డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి తెలిపారు. జిల్లా సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ఆదివారం టిటిడి కళ్యాణ మండపంలో ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం, ఆవిర్భావ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా భోజారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సంక్షేమ పట్ల చిత్తశుద్ధితో పని చేస్తుందని చెప్పారు. ఈ మేరకు ఉద్యోగుల వేతనాలు పెంచుతామని అసెంబ్లీ వేదికగా సీఎం కేసీఆర్ చేసిన ప్రకటనను గుర్తు చేశారు. 15 సంవత్సరాలుగా సమగ్ర శిక్ష ఉద్యోగులు విద్యాశాఖలో అంతర్భాగంగా ఉంటూ విద్యాభివృద్ధికి తమ వంతు చేయూతను అందిస్తున్నారని సెక్టోరల్ అధికారి కంటే నర్సయ్య పేర్కొన్నారు. కేజీబీవీ సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం టీఎస్‌యూటీఎఫ్ అలుపెరుగని పోరాటం చేసిందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఓరగంటి అశోక్ చెప్పారు. స్వతంత్ర సంఘంగా ఆవిర్భవించినప్పటికీ భవిష్యత్తులోనూ తమ మద్దతు కొనసాగుతుందని అన్నారు. సమగ్ర శిక్ష ఉద్యోగులకు పేస్కేలు బదిలీల గురించి పిఆర్‌టియు రాష్ట్ర శాఖ పక్షాన తమ వంతు కృషి చేస్తామని ఆ సంఘం జిల్లా అధ్యక్షులు కొమ్ము కృష్ణకుమార్ చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పనిచేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్టు ఉద్యోగులకు తగిన న్యాయం చేయవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని సెక్టోరల్ అధికారి సుజాత్ ఖాన్ అన్నారు. ఉద్యోగులందరూ సంఘటితం కావడం శుభసూచకమని వారి ఆకాంక్షలు నెరవేరాలని సెక్టోరల్ అధికారి జెట్టి నారాయణ తెలిపారు. ఆదిలాబాద్‌లో ఆరంభమైన సమగ్ర శిక్ష అభియాన్ సంఘం ఆవిర్భావం రాష్ట్రమంతటా విస్తరించాలని తెలంగాణ జాక్ ప్రధాన కార్యదర్శి దుండిగల్ యాదగిరి ఆకాంక్షించారు. అనంతరం 28 మందితో కూడిన జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా డి అనురాధ, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా సిహెచ్ దీప్తి, ప్రధాన కార్యదర్శిగా పడాల రవీందర్, కోశాధికారిగా కిన్నెర్ల ప్రశాంత్‌రెడ్డి ఎన్నికయ్యారు.



అధికార పార్టీ గూండాయిజానికి గుణపాఠం తప్పదు

- కాంగ్రెస్ నాయకుల హెచ్చరిక



నవతెలంగాణ- మంచిర్యాలటౌన్

అధికార పార్టీ నాయకులు, కార్యకర్తలు చేస్తున్న గూండాయిజానికి గుణపాఠం తప్పదని కాంగ్రెస్ పార్టీ నాయకులు హెచ్చరించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఐబిలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ వేములపల్లి సంజీవ్ మాట్లాడుతూ అధికారిక కార్యక్రమంలో ప్రోటోకాల్ పాటించని విధానాన్ని ప్రజాస్వామ్యబద్ధంగా ప్రశ్నిస్తే తమపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు కనీస సదుపాయాలు కల్పించకుండా కేవలం రోడ్లు, పట్టణ సుందరీకరణ అంటూ ప్రజలను మభ్యపెడుతున్నారని ఆరోపించారు. ప్రజలు ఎన్నుకున్న తమను గుర్తించకుండా స్వార్థ రాజకీయాల కోసం ఆ పార్టీ నాయకులకు ప్రాధాన్యత ఇవ్వడం కుటిల రాజకీయాలకు నిదర్శనమని ఎండగట్టారు. తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న దివాకర్‌రావు కూడా ప్రోటోకాల్ విషయంలో రాద్ధాంతం చేశారని గుర్తు చేశారు. విలేకరుల సమావేశంలో టిపిసిసి కార్యదర్శి కొండ చంద్రశేఖర్, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు పెంట రజిత, పట్టణ అధ్యక్షురాలు హేమలత, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పూదరి తిరుపతి, మున్సిపల్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ మాజీద్, కౌన్సిలర్ సల్ల నరేష్, జంగాపెల్లి బాపన్న పాల్గొన్నారు.

చిన్నారులు స్మార్ట్ ఫోన్ వాడకాన్ని తగ్గించాలి

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చిన్నారులు స్మార్ట్ ఫోన్ వాడకాన్ని తగ్గించేలా అవగాహనా కార్యక్రమాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని మొదటి అదనపు జిల్లా న్యాయమూర్తి మాధవీ కృష్ణ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ విశ్రాంతి భవనం నుండి ప్రయివేటు పాఠశాల అధ్వర్యంలో వన్ కే రన్ ను నిర్వహించారు. గాడ్జెట్ ఫ్రీ చైల్డ్ హుడ్ అనే అంశంపై అవగాహన కల్పించేలా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. స్మార్ట్ ఫోన్లు అధికంగా వాడడం వల్ల కలిగే అనర్థాలను ప్లకార్డులు ప్రదర్శిస్తూ విద్యార్థులు వన్ కే రన్‌లో ఉత్సాహంగా పాల్గొన్నారు. సెల్ ఫోన్లను మితిమీరి వాడితే చిన్నారులు ఎదుర్కొనే ఆరోగ్యపరమైన సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఇటువంటి కార్యక్రమాలు దోహదం చేస్తాయని అతిథులు పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వహణకు ముందుకువచ్చిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. అంతకుముందు డీఎల్ఎస్ఏ కార్యదర్శి క్షమా దేశ్‌పాండే, డీఎస్పీ ఉమేందర్‌తో కలిసి క్రీడాజ్యోతిని వెలిగించి వన్ కే రన్ ను ప్రారంభించారు.

అనుదినం జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
2
సోమవారం 06 మార్చి 2023

నేటి ప్రజా సంఘాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలి

నవతెలంగాణ-నిర్మల్

సోమవారం జరిగే ప్రజా సంఘాల జిల్లా సదస్సును జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు డాకూరి తిరుపతి, దుర్గం నూతన్ కుమార్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఏప్రిల్ 5న చలో ఢిల్లీ కార్యక్రమం జరగనుందని తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ ఆధ్వర్యంలో సోమవారం జిల్లా కేంద్రంలోని ప్రజా సంఘాల ఐక్యవేదిక కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బుర్రి ప్రసాద్, సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు, తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ హాజరవుతారని తెలిపారు. ఈ సదస్సుకు కార్మికులు, వివిధ సంఘాల కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలని కోరారు.

తవ్వుకునోళ్లకు..తవ్వుకున్నంత..!

- రామారావుపేట్ శివారు నుండి అక్రమంగా తరలిపోతున్న మట్టి
- సింగరేణికి కేటాయించిన భూముల్లో తవ్వకాలు
- జాతీయ రహదారి నిర్మాణం పేరుతో వెంచర్లకు తరలింపు

నియమ నిబంధనలంటూ ఏమీ లేవు..హద్దూఅదుపు అసలే లేదు..ఇష్టం వచ్చినంత తవ్వుకోవచ్చు..పది నుండి ఇరువై లారీలు రాత్రీపగలు తేడా లేదు. వందల ట్రిప్పుల్లో మట్టి తరలిపోతోంది. మట్టి తవ్వేందుకు మైనింగ్ అనుమతి కావాల్సి ఉన్నా అడిగేవారే లేరు. జాతీయ రహదారి నిర్మాణం కోసం వినియోగించాల్సిన మట్టి ప్రయివేటు వ్యక్తులు నెలకొల్పిన వెంచర్లకు తరలిస్తున్నారు. ఫిర్యాదు చేస్తే పట్టించుకునే వారు లేరు. మట్టి ఎక్కడికి పోతుందో అధికారులకు తెలియదా? అంటే తెలియకుండా ఎలా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలిసినా తెలియనట్టు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. రామారావుపేట్ శివారు నుండి తరలిపోతున్న అక్రమ మట్టి రవాణా తీరుపై కథనం..



నవతెలంగాణ-జైపూర్

ఇందారం ఓపెన్‌కాస్ట్ గని విస్తరణ కోసం గుర్తించబడిన రామారావ్‌పేట్ శివారు భూముల నుండి మట్టి అక్రమ రవాణా జోరుగా కొనసాగుతోంది. పట్టాదారులతో ఫైనల్ సెటిల్‌మెంట్ కాకపోయినా భూములను తీసుకోవడానికి సింగరేణి.. ఇవ్వడానికి రైతులు మానసికంగా సిద్ధంగా ఉన్నారు. రేపోమాపో సింగరేణికి అప్పగించాల్సిన భూములు, ఎంతో కొంత నగదు వ్యాపారులు ముట్టజెప్తుతుండటంతో మట్టి తవ్వకాలకు పట్టాదారుల నుండి ఎలాంటి ఇబ్బంది లేదు. ఫైనల్ సెటిల్‌మెంట్ కానందున సింగరేణి యాజమాన్యం అడ్డు చెప్పడానికి లేకుండా పోయింది. ఇదే అవకాశంగా భావించిన అక్రమార్కులు సింగరేణి తీసుకునే భూముల్లో క్వారీలు ఏర్పాటు చేసి మట్టి తవ్వకాలు కొనసాగిస్తున్నారు. ముందుగా రైతులతో బేరం కుదుర్చుకుంటున్న అక్రమార్కులు రైతుల పేరుతో మట్టి తవ్వకానికి మైనింగ్ డిపార్ట్‌మెంట్ నుండి అనుమతులు పొందుతున్నారు. నాగాపూర్-విజయవాడ జాతీయ రహదారి నిర్మాణపు పనులను అడ్డం పెట్టుకుని అక్రమంగా ఇతర ప్రాంతాలకు మట్టి తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. తరచి చూస్తే తవ్వ మట్టి ఎక్కడికి వెలుతుందో తెలియకుండా మంచిర్యాల పరిసర ప్రాంతాల్లో నెలకొల్పిన వెంచర్లకు తరలిపోతోంది. మైనింగ్ అనుమతి పత్రాలతో రెవెన్యూ క్లియరెన్స్ పొందుతున్న మట్టి వ్యాపారులు క్వారీలు ఏర్పాటు చేసి ఇష్టం వచ్చినట్లు తవ్వుకుంటున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

అనుమతించిన సర్వే నెంబర్‌లోనే తవ్వుతున్నారా...?

పట్టాదార్ పాసు పుస్తకం ఉంటే చాలు మట్టి తవ్వుకునేందుకు అనమతి లభించినట్లే. మైనింగ్ డిపార్ట్‌మెంట్ ఇచ్చిన అనుమతితో రెవెన్యూ క్లియరెన్స్ పొందిన అక్రమార్కులు ఎక్కడంటే అక్కడ తవ్వుతున్నట్లు తెలుస్తోంది. మైనింగ్ అనుమతించింది ఎంత...? ఎంత వరకు తవ్వుకోవాలో అంత వరకే పరిమితం కావాల్సి ఉంటుంది. కాని రామారావుపేట్‌లో ఏర్పాటు చేసిన మట్టి క్వారీలు పెద్ద పెద్ద అఘాదాలను తలపిస్తునాయి. అంతే కాదు అనుమతించిన హద్దు అంటూ ఏమీ లేదు. ఎంత లోతు తవ్వాలి.. ఎక్కడి వరకు తవ్వాలనే హద్దులు ఏర్పాటు చేయకపోవడంతో భూగర్భాన్ని చీల్చేస్తున్నారు.

పేరు జాతీయ రహదారి.. ఆ తర్వాత ఎవరి దారి వారిది..

రామారావుపేట్ శివారు క్వారీ నుండి మట్టితో బయలుదేరిన లారీ రోడ్డు ఎక్కిందంటే చాలు ఎక్కడికి వెళ్లాలో అక్కడికే వెళ్తుంది. మంచిర్యాల పట్టణ సరిహద్దుల్లో ఏర్పాటైన లే అవుట్‌లు, వెంచర్లకు అత్యధికంగా తరలిస్తున్నారు. మట్టి అక్రమ మార్గంలో తరలివెళ్తోందని ఫిర్యాదు చేస్తే జాతీయ రహదారి నిర్మాణం కోసం పర్మిషన్ ఇచ్చాం తప్ప తాము కాపలా ఉండలేం కదా అనే జవాబు వినాల్సి వస్తోందని పలువురు వాపోతున్నారు. ఈ క్రమంలో స్థానికులు, పరిసర గ్రామాలకు చెందిన నాయకుల అండదండలతో మట్టి అక్రమ రవాణ కొనసాగుతున్నట్లు తెలుస్తోంది. ఇందులో మట్టి వ్యాపారులకు మరో విధంగా లాభం చేకూరుతోంది. నాగాపూర్-విజయవాడ జాతీర రహదారి నిర్మాణంలో సింగరేణి ఓసీ మట్టిని వినియోగిస్తూ, రామారావుపేట్ శివారులో ఏర్పాటు చేసిన క్వారీ బిల్లులు ఇక్కడ వాడుకుంటున్నట్లు తెలుస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో అక్రమ రవాణాను నియంత్రించాలని సాహసం చేయలేక వెనక్కితగ్గాల్సి వస్తోందని పలువురు పేర్కొంటున్నారు. మట్టి అక్రమ రవాణకు సంబంధించి నాయకులకు, ప్రభుత్వ అధికారులకు ఎక్కడికక్కడ ముడుపులు అందుతున్నాయనే ఆరోపణలు లేకపోలేదు.

నిబంధనలు అతిక్రమిస్తే సహించేది లేదు : మోహన్‌రెడ్డి, తహసీల్దార్

రామారావుపేట్ శివారులో మట్టి క్వారీ ఏర్పాటు చేసింది నిజమే. నాగాపూర్-విజయవాడ రోడ్డు నిర్మాణం కోసం మట్టి అవసరమై రైతుల ద్వారా తవ్వకానికి పర్మిషన్ పొందారు. నేరుగా మైనింగ్ అనుమతితో వచ్చిన వారికి రెవెన్యూ పరంగా ఎన్‌ఓసీ ఇవ్వడం జరిగింది. నిర్ణీత గడువు, నియమ నిబంధనలకు లోబడి తవ్వకాలు జరపాలని మట్టి తవ్వకం కోసం ఇచ్చిన అనుమతుల్లో వివరంగా వెల్లడించాం. అయినప్పటికీ నిబంధనలు అతిక్రమిస్తే చూస్తూ ఊరుకోబోం. స్పాట్ విజిట్ చేయడంతో పాటు పర్మిషన్ పొందిన సర్వే నెంబర్‌లోనే తవ్వుతున్నారా? అనే విషయాన్ని లొకేషన్ మ్యాప్ ద్వారా పరిశీలిస్తాం.





పోలీస్ శాఖకు సౌకర్యాలు కల్పించాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నియోజకవర్గంలో పోలీస్ శాఖ అవసరమైన సౌకర్యాలు కల్పించాలని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. రాష్ట్ర హోం శాఖ మంత్రి మహమూద్ అలీని మర్యాదపూర్వకంగా ఆయన కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాదిగూడ మండల కేంద్ర పోలీస్‌స్టేషన్‌కు భవనం మంజూరు చేయాలని, జిల్లా జైలు మరమ్మత్తులకు నిధులు మంజూరు చేయాలని కోరారు. జైనూర్ మండల కేంద్రంలో అగ్ని మాపక కేంద్రం మంజూరు చేయాలని కోరారు. 15వ బెటాలియన్ సత్తిపల్లిలో పని చేస్తున్న గిరిజన పోలీస్ ఉద్యోగులను వారి సొంత జిల్లాలకు బదిలీ చేయాలని కోరారు.

అంతర్జాతీయ క్రీడాకారునికి సన్మానం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

సాఫ్ట్ బేస్‌బాల్‌లో అంతర్జాతీయ స్థాయికి ఎంపికైన మండలంలోని తుంపల్లి గ్రామానికి చెందిన క్రీడాకారుడు రేఖల తనీష్‌ను జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 20న భూటాన్‌లో జరిగే సాఫ్ట్ బేస్‌బాల్ పోటీలకు భారత్ తరపున పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. తనీష్‌ను మరింత మంది ఆదర్శంగా తీసుకొని జిల్లా పేరును ఉన్నత శిఖరాలకు చేర్చాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అరిగెల మల్లికార్జున్ యాదవ్, క్రీడాకారుని తండ్రి రేఖల తిరుపతి, రేఖల సుదర్శన్, రేఖల దత్తు, ఆత్మకూరి తిరుపతి, తుక్కిరెడ్డి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బండి సంజయ్ నోరు తెరిస్తే నూరు అబద్ధాలు

- డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌అర్బన్

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నోరు తెరిస్తే నూరు అబద్ధాలే మాట్లాడతారని డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి ఎద్దేవా చేశారు. ఆదివారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. సంజయ్ ఎంతసేపు సీఎం కేసీఆర్, ఎమ్మెల్సీ కవితపై అబద్ధపు ప్రచారాలు చేస్తారని, అందులో భాగంగానే ఎమ్మెల్యే జోగు రామన్నపై దుష్ప్రచారం చేయడానికి జిల్లా కేంద్రానికి వచ్చారని తెలిపారు. ఎమ్మెల్యే రామన్న వదిలేసిన కచరాను తమ పార్టీలో చేర్చుకోవడానికి ఇక్కడికి రావడం సిగ్గుచేటన్నారు. తమ నాయకుడు నాలుగు సార్లు ఎమ్మెల్యేగా ఒక దఫా మంత్రిగా పనిచేశారని, ఆయనను విమర్శించే నైతికత బండి సంజయ్‌కు లేదని మండిపడ్డారు. సంజయ్ అనేక ఆరోపణలు ఎదుర్కొంటున్న నాయకుడని, పదుల సంఖ్యలో పోలీస్‌స్టేషన్‌లలో తమ నాయకుడు కనబడుటలేదని కరీంనగర్‌లో ప్రజలు ఫిర్యాదులు కూడా చేశారని దుయ్యబట్టారు. కరీంనగర్ గుట్టల నుంచి గ్రానైట్, కుంభకోణాలు, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. జిల్లా బిజెపిలో భూకబ్జాదారులు, గ్రానైట్ దొంగలు పేరుకు పోయారని ఆరోపించారు. రాష్ట్ర నాయకుల సమక్షంలో పట్టుమని వంద మంది కూడా చేరలేదని విమర్శించారు. సంజయ్ అదృష్టవశాత్తు గెలిచిన నాయకుడని, బిజెపి రాష్ట్ర అధ్యక్షుడిగా సిసిఐ, కేంద్రీయ విశ్వవిద్యాలయం, గిరిజన విశ్వవిద్యాలయం, టెక్స్‌టైల్ పార్క్ గురించి ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు.

జిల్లా కేంద్రంలో పీజీ కళాశాలను తిరిగి ప్రారంభించాలి



నవతెలంగాణ-నిర్మల్


జిల్లా కేంద్రంలో ప్రభుత్వ పీజీ కళాశాలను తిరిగి ప్రారంభించాలని పీడీఎస్‌యూ జాతీయ నాయకులు ఎస్.నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.ఆజాద్ అన్నారు. ఆదివారం జిల్లా సర్వసభ్య సమావేశం జిల్లా అధ్యక్షులు మహేందర్ అధ్యక్షతన ఎస్ఎస్ఆర్ కళాశాలలో నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం జరిగి ఎనిమిదేండ్లు గడుస్తున్నా ప్రభుత్వ విద్యారంగం అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. తెలంగాణలో కార్పొరేట్ విద్యాసంస్థల ర్యాంకుల దాహానికి ఒత్తిళ్లతో ప్రతిరోజూ విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అయినా సీఎం కేసీఆర్ నోరుమేదపడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తుశుద్ధి ఉన్నా తక్షణమే కార్పొరేట్ విద్యాసంస్థలను ప్రభుత్వం అధీనంలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణలోని ప్రభుత్వ విద్యాసంస్థల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరారు. తక్షణమే విద్యారంగ సమస్యల పరిష్కారానికి విద్యార్థుల అత్మహత్యల నివారణకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావాలని, లేనియెడల రాబోయే రోజుల్లో విద్యార్థి పోరాటాలను తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎమ్.నరేందర్, రాష్ట్ర కమిటీ సభ్యులు ఎల్.అనిల్, నిజామాబాద్ జిల్లా నాయకులు దుర్గ ప్రసాద్, జిల్లా నాయకులు నవీన్, పవన్, కిరణ్, గణేష్, విశాల్, రాజారాం, గంగరాజు పాల్గొన్నారు.

తహసీల్దార్ బదిలీ

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

మండల తహసీల్దార్‌గా పనిచేస్తున్న ముంజం సోము బజార్‌హత్నూర్ మండలానికి బదిలీకాగా ఆయన స్థానంలో బజార్‌హత్నూర్ తహసిల్దార్‌ను నియమిస్తూ ఉత్తర్వులు జారి అయ్యాయి. గత ఏడాది మార్చి నెలలో బాధ్యతలు చేపట్టి ఏడాది పాటు ఇంద్రవెల్లి తహసీల్దార్‌గా సేవలందించారు. జిల్లా ఉన్నతాధికారులు ఇటీవల జరిగిన గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆయనకు ఉత్తమ తహసిల్దార్‌గా అవార్డు పొందారు. మంచి అధికారిగా మన్నలను పొందిన ఆయనకు అనతికాలంలోనే బదిలీ కావటంతో మండల వాసులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధం



నవతెలంగాణ-దిలావర్‌పూర్

ప్రమాదవశాత్తు ఇల్లు దగ్ధమైన ఘటన ఆదివారం మండలంలోని మాయాపూర్ చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన గొర్రెల కాపరి కామిండ్ల గంగాధర్ గొర్రెలను కాసేందుకు, అతని తండ్రి తోట పనికి వెళ్లారు. ఆదివారం ఇంట్లో ఎవరు లేని సమయంలో హటాత్తుగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. గంగాధర్ ఇటీవలే గొర్రెలు అమ్మగా వచ్చిన డబ్బులు రూ.80 వేలు, రెండు తులాల బంగారం, టీవీ, ఫ్రిడ్జ్, మంచాలు, నిత్యవసర సరుకులు, ఇతర సామాగ్రితో సహా ఇల్లు దగ్ధమైది. అగ్ని ప్రమాదంలో సుమారు రూ.12 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగిందని ఆర్ఐ సంతోష్ తెలిపారు. జరిగిన ఈ హఠాత్పరిణామంతో బాధితుడు దిగ్భ్రాంతికి లోనయ్యారు. ప్రభుత్వ తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

IN THE COURT OF THE HON'BLE FAMILY COURT CUM III ADDL. DISTRICT AND SESSIONS JUDGE AT: ADILABAD

G.W.O.P. No. 01/2023

BETWEEN:-

Annie Anthony, W/o. Late Anthony Moses Jairaj, Age: 39 years, Occupation: House wife, R/o. H. No. 9-278/9, Ridhi Siddhi Enclave, Teachers colony, Rajeev nagar Colony, Adilabad-504001.

......Petitioners

// A N D //

To Whom So Ever it may be concerned.

......Respondent

To

To whom so ever it may concerned.

Respondent

Whereas, the above named Petitioner by name Annie Anthony, W/o. Late Anthony Moses Jairaj, Age: 39 years, Occupation: House wife, R/o. H. No. 9-278/9, Ridhi Siddhi Enclave, Teachers colony, Rajeev nagar Colony, Adilabad-504001 made an application before this Court to appoint her as guardian for the minors namely 1. Anthony Premraj S/o. Late Anthony Moses Jairaj, Age: 13 years, Occ: (Minor) Student, 2) Anthony Alexander Raj, S/o. Late Anthony Moses Jairaj, Age: 9 years, Occ: Minor (Student), both are R/o. H. No. 9-278/9, Ridhi Siddhi Enclave, Teachers colony, Rajeev nagar Colony, Adilabad-504001 and to collect the documents and sold out the flat bearing its descriptions:

Schedule of property:

Flat No. 301 semi finished south west corner second floor of the building known as RIDDHI SIDDHI ENCLAVE, with built-up area including common area 1000.00 sft = 111.11 sqr. Yards = 92.90 sq meters., with the proportionate undivided share of land of 300.00 Sq feets = 33.33 sq yards = 27.87 sq., meters., in plot No. 3 & 4 in survey No. (3) of village Dasnapur, G.P Mavala, Mandal & district Adilabad and there is a car parking in the stilt floor, boundaries of which are as under:-

East : 6'.00" Wide Passage,
West : Open to Sky,
North :3'.9" Wide open to sky,
South :Open to sky

Situated at Teachers Colony of village Dasnapur, Mandal and District Adilabad.

The above matter on posted on 13.03.2023 before this Court and whoever has got interested or objection for appointment of Annie Anthony, W/o. Late Anthony Moses Jairaj as guardian to the above minors and their properties, they are at liberty to appear before this court on 13.03.2023 at 10.30 A.M., to Show Cause the above case, failing which the said application will be heard and decided exparte on merits.

// By order of the Court //

Place: Adilabad
Date: 03.03.2023

**Ahmed Abdul Raheem,
Ghanshyam Singh Chauhan
&
Ahmed Abdul Naseem
Advocates, Adilabad**

స్మైల్ సొసైటీ అన్నదానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆవరణలో స్మైల్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ అధ్యక్షుడు కేమ శ్రీకాంత్ మాట్లాడుతూ 15 వారాలుగా సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి ఆదివారం తమ వంతుగా రోగుల సహాయకులకు, పేదలు, నిస్సహాయుల ఆకలి తీరుస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సొసైటీ ప్రతినిధులు భూరె సురేష్, రామకృష్ణ, విశాల్, ఆకాష్, గంభీర్ పాల్గొన్నారు.

దేశ సేవ చేయడం గొప్ప విషయం

నవతెలంగాణ-తాంసి

దేశ సేవ చేయడం గొప్ప విషయమని ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఎంపీపీ, జడ్పీటీసీతో కలిసి కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. అనంతరం భీంపూర్ మండల కేంద్రానికి చెందిన ఆర్మీ జవాన్ రాథోడ్ విలాస్ ఉద్యోగ విరమణ చేస్తున్న సందర్భంగా దంపతులను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాథోడ్ విలాస్ 1997లో ఆర్మీ ఉద్యోగం సాధించి దేశ రక్షణలో భాగంగా ఎన్నో రాష్టాలు తిరిగి దేశ సేవ చేశారని తెలిపారు. ఆయనను ఆదర్శంగా తీసుకొని యువత ఆర్మీలో చేరాలని తెలిపారు. కొడుకుని దేశ సేవ కోసం పంపినందుకు జవాన్ తల్లిని సన్మానించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నాగయ్య, ఎంపిపి రత్న ప్రభ సంతోష్, జడ్పీటీసీ సుధాకర్, సర్పంచులు లింబాజీ, నరేందర్ పాల్గొన్నారు.

మదర్స వార్షికోత్సవ సభ పోస్టర్ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 10న నిర్వహించే మదర్స అరేబియా మదీనా తులుమ్ పదవ వార్షికోత్సవం వేడుకల సభ పోస్టర్ జిల్లా కేంద్రంలో నిర్వహణ కమిటీ విడుదల చేసింది. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వహణ కమిటీ బాధ్యులు అబ్దుల్ ఫయాజ్, అలీ బీన్ అహ్మద్ మాట్లాడుతూ వార్షికోత్సవ సభ ఘనంగా నిర్వహించడం జరుగుతుందని, కార్యక్రమాన్ని ముస్లింలు ఇతరులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు. పట్టణంలోని నూర్ నగర్ ఈద్గా వద్ద వార్షికోత్సవం సందర్భంగా ఖురాన్ ప్రత్యేకతపై సందేశం ఇవ్వడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సభకు ఆల్ ఇండియా రేడియో ఆర్టిస్ట్ మగ్దుం మోహినుద్దీన్‌తోపాటు మౌలానాలు హాజరు అవుతున్నట్లు తెలిపారు. ఈ సభకు ముస్లింలు, ముస్లింయేతరులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మదర్స వార్షికోత్సవ నిర్వహణ కమిటీ సభ్యులు అహ్మద్ బిన్ అబ్దుల్లా, అబ్దుల్ రహమాన్, సయ్యద్ నిసార్, సాజిద్, సలం, షబ్బీర్, సల్మాన్‌ఖాన్, ఎండీ అహ్మద్, సయ్యిద్ జావిద్, సయ్యద్ సోజర్, సలీం బేగ్, షేక్ చాంద్, తాజ్, ఇమ్రాన్, ఇమ్రాన్ హష్మీ, నజీర్, శాకిర్, మదర్స నిర్వాహకులు జాఫర్ సాదిక్ హుస్సేన్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం

- జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్



నవతెలంగాణ-ఉట్నూర్

ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి ప్రభుత్వం తరపున అండగా ఉంటామని జడ్పీ చైర్మన్ రాథోడ్ జనార్ధన్ అన్నారు. ఇంట్లో దేవుళ్ళ వద్ద వెలిగించిన దీపం వల్ల ప్రమాదవశాత్తు ఇలు కాలిపోయిన సంఘటన శనివారం రాత్రి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న చైర్మన్ ఆదివారం పట్టణంలోని శాంతినగర్ కాలనిలో నివాసం ఉంటున్న ఒల్లెపు భుజంగ్‌రావ్ కుటుంబాన్ని పరామర్శించారు. సంఘటనకు సంబందించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి యధావిధిగా రాత్రి దేవుళ్ళ చిత్ర పటల వద్ద పూజలు ఆనవాయితీగా వస్తోందని, ఈ సమయంలో వెలిగించిన దీపాల వల్ల ప్రమాదవశాత్తు ఇల్లు కాలిపోయిందని బాధితుడు తెలిపారు. వెంటనే తహసీల్దార్ కార్యాలయ సిబ్బందికి ఫోన్ చేసి చెప్పడంతో వారు వచ్చి వివరాలు సేకరించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్ బాధిత కుటుంబానికి దుప్పట్లతో పాటుగా ఆర్థిక సాయం అందించారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
www.navatelangana.com
మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 06 మార్చి 2023

దుర్గామ్మ ఆలయ నిర్మాణానికి విరాళం

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



మందమర్రి పట్టణంలోని కేకే-1గని ప్రాంతంలోగల సీహెచ్‌పీ వద్ద ఉన్న దుర్గా భవాని అమ్మవారి ఆలయ నిర్మాణానికి జీఎస్‌ఆర్ ఫౌండేషన్ అధ్యక్షుడు డాక్టర్ రాజా రమేష్ బాబు రూ.10,116 విరాళంగా అందజేశారు. అనంతరం డాక్టర్ రాజా రమేష్ మాట్లాడుతూ ఈ ఆలయానికి వచ్చి వెళ్ళే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కల్గకుండా సౌకర్యాలు కల్పించేందుకు తోడ్పాటును అందిచామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సేవాదళ్ ఉపాధ్యక్షులు పాషా, ఫౌండేషన్ సభ్యులు ఉప్పులపు సురేష్, భూతగడ్డ రమేష్, వేణు, పప్పు రాజు, ప్రకాశ్, అశోక్ పాల్గొన్నారు.

ప్రశాతంగా ముగిసిన ప్రవేశ పరీక్షలు

నవతెలంగాణ-సిర్పూర్(టి)

తెలంగాణ సాంఘీక సంక్షేమ గురుకులాల్లో సీఓఇ ఇంటర్ మీడియట్ మొదటి సంవత్సరం, డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశానికి జిల్లాలో నిర్వహించిన పరీక్ష ప్రశాంతంగా ముగిసిందని ఆసిఫాబాద్ డీసీఓ పోలోజు బాలరాజు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జిల్లా ఆరు పరీక్ష కేంద్రంల్లో మొత్తం 1726 మంది విద్యార్థులకు గాను 1619 మంది విద్యార్థులు పాఠశాలకు హాజరయ్యారని తెలిపారు. డిగ్రీ మొదటి సంవత్సరం ప్రవేశ పరీక్ష సిర్పూర్(టి) బాలుర పాఠశాలలో 347 మంది విద్యార్థులకు గాను 317 మంది విద్యార్థులు, సిర్పూర్(టి) బాలికల పాఠశాలలో 333 మంది విద్యార్థులకు గాను 304 మంది విద్యార్థులు హాజరైనట్టు తెలిపారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు.

ధర లేక
నల్లబడుతున్న తెల్ల బంగారం

- రోజుల తరబడి ఇండ్లు, పొలాల వద్దనే నిల్వ
- నెలలు గడుస్తున్నా పెరగని పత్తి ధర
- ఆందోళనలో అన్నదాతలు



నవతెలంగాణ-రెబ్బెన

పంట దిగుబడి లేక, పండించిన పంటలకు ధర లేక, పెట్టిన పెట్టుబడులు కూడా చేతికందని పరిస్థితిలో పత్తి రైతులు కొట్టుమిట్టాడుతున్నారు. ధర పెరిగే వరకు పత్తి పంటను ఇంటిలో ఉంచుకోలేక, తక్కువ ధరకు పంటను అమ్ముకోలేక మనోవేదనకు గురవుతున్నారు. పంటను నెలల తరబడి ఇంటిలోనే నిల్వ చేసుకొని ఎప్పుడు ధర పెరుగుతుందా అని ఆశగా ఎదురుచూస్తున్నారు.

మండలంలో 24,496 ఎకరాల్లో సాగు..

మండలంలో సాగుచేసే పంటలో పత్తి పంటదే మొదటిస్థానం. వర్షాకాలంలో మండలంలో 24,496 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. వర్షాకాలం ప్రారంభం నుండే కురిసిన భారీ వర్షాలతో చాలా గ్రామాల్లో పత్తి పంటలు తీవ్రగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాల కారణంగా భూమిలో తేమ శాతం ఎక్కువగా ఉండి పత్తిలో ఎదుగుదల లోపించి దాని ప్రభావం దిగుబడిపై చూపించింది. పత్తి దిగుబడి ఎకరానికి సగటున 5 నుండి 6 క్వింటాళ్ల ఉండగా అధిక వర్షాల కారణంగా 3 నుండి 4 క్వింటాళ్లకు మించలేదు. నీరు నిలువని తేలిక భూముల్లో కొంత ఆశించిన స్థాయిలో దిగుబడి రాగా 90 శాతం భూముల్లో దిగుబడి తగ్గిపోయింది. సీజన్ ప్రారంభంలో పత్తి ధర క్వింటాల్‌కు రూ.9100 పలికి రైతులను ఊరించగా ఆపై క్రమంగా తగ్గుతూ వస్తూ రైతులను ఆర్థికంగా కుంగదీసింది.

పట్టించుకోని రైతుబంధు సమితిలు

తెలంగాణ రాష్ట్రం రైతు సమన్వయ సమితి పేరిట కార్పొరేషన్ ఏర్పాటుచేసి 2018లో ఉత్తర్వులు జారీ చేసింది. దీని తర్వాత రైతుబందు సమితిగా పేరు మార్చింది. రైతుబంధు సమితుల ద్వారా రైతులందరికి సమన్యాయం చేసి వారి అవరాలను తీర్చేవిధంగా ప్రణాళిక రూపొందించింది. మండలంలో ఏ ఒక్క రైతు బంధు సమితి కూడా రైతుల పక్షాన నిలబడలేదు. అదేవిధంగా మద్దతు ధర కల్పనకు కృషి చేసిన దాఖలాలు లేవు. రైతుబంధు సమితులు రైతులు పండించిన వివిధ పంటల ఉత్పత్తి ఉత్పాదకతను పెంపొందించి వాటికి మద్దతు ధర కల్పించడమే ఈ సమితుల యొక్క ముఖ్య ఉద్దేశ్యం. మండలంలో అధిక మొత్తంలో రైతులు పత్తి పంటను సాగుచేసి మార్కెట్‌లో మద్దతు ధర లేక రైతులు విలవిలలాడుతున్నారు. మార్కెట్‌లో మద్దతు ధర లభించనప్పుడు వీటితో జోక్యం చేసుకొని మంచి ధర అందేలా ఈ సమితులు కూడా చేయాల్సిన బాధ్యత ఉంది. కానీ అక్టోబర్ నుండి పత్తి దిగుబడులు వచ్చినప్పుడు రైతులకు మద్దతు ధర లేక ఇండ్లలోనే నిల్వ చేసుకొని మద్దతు ధర కోసం వేచిచూస్తున్నప్పటికీ మద్దతు ధర ఇప్పించడంలో రైతు బంధు సమితులు జిల్లాల్లోనే విఫలమవుతున్నాయని చర్చ కొనసాగుతుంది. ఆరుగాలం కష్టపడి పత్తి పంటను పండించిన రైతులకు నిరాశే ఎదురౌవుతుంది. అక్టోబర్ నుండే పత్తిని తీసి ఇండ్లలోనే నిల్వ ఉంచారు. అక్టోబర్ మాసంలో క్వింటాళ్ పత్తి ధర అనేది రూ.10 వేలకు అటూ ఇటూ ఉండగా గత మూడు నెలల కాలంలోనే ధరలు తగ్గడంతో రైతులు అయోమయానికి గురవుతున్నారు. క్వింటాల్ పత్తి ధర ఒకేసారి రూ.రెండు నుండి రూ.మూడు వేల ధర తగ్గడంతో రైతులు అమ్మడానికి మొగ్గు చూపడంలేదు. ప్రస్తుతం ధరలు పెరగకపోయిన ముందుముందు పెరగవచ్చనే ఆశతో ఇంకా వేచిచూస్తున్నారు.

పెట్టుబడులు కూడా రాలేని దుస్థితి..

గత ఏడాదితో పోల్చితే ఈసారి పత్తి పంటకు సాగు గణనీయంగా పెరిగింది. పెరిగిన డీజీల్ ధర ప్రభావం దుక్కి దున్నె ట్రాక్టర్ కిరాయిపై చూపగా పెరిగిన కూలీల ఖర్చులు, ఎరువుల ధరలు, పెట్టుబడులు అధికంగా పెరిగేందుకే కారణమయ్యాయి. పత్తి ధర రోజురోజుకు పతనమవుతూ ప్రస్తుతం రూ.8 వేల ధర పలుకుతుంది. గతేడాది సీజన్‌లో చివరలో క్వింటాళ్‌కు రూ.10 వేల వరకు చేరడంతో ఈసారి కూడా అలాగే పెరుగుతుందేమోననే ఆశతో పండిన పంటనంతా ఇంటిలోనే నిల్వ చేసి ధర పెరుగుదల కోసం ఆశగా ఎదురుచూస్తున్నారు. సీజన్ ముగుస్తున్నా ధర పెరుగుదల లేకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

దిగుబడి తగ్గి ఖర్చు పెరిగింది

జుమ్మి మల్లయ్య, రైతు, తుంగెడ



గతేడాదితో పోల్చితే ఈసారి పత్తికి దిగుబడి తగ్గి ఖర్చులు బాగా పెరిగాయి. నా సొంత భూమి ఐదెకరాల్లో పత్తి పంట సాగుచేస్తే రూ.1.5 లక్షలు ఖర్చు వచ్చింది. పోయిన ఏడాది 28 క్వింటాళ్లు పత్తి దిగుబడి రాగా ఈసారి 18 క్వింటాళ్లు మాత్రమే వచ్చింది. వర్షాలతో ఈసారి మొత్తం మునిగినం.

రూ.15 వేలు ధర చెల్లించాలి..

ధరావత్ రవీందర్, రైతు, కైరిగూడ



పత్తి క్వింటాళ్‌కు రూ.15 వేలు ధర పెంచాలి. అధిక వర్షాలతో పత్తి పంట దెబ్బతిని రైతులంతా తీవ్రంగా నష్టపోయాం. ఈసారి పెరిగిన ధరల కారణంగా పెట్టుబడులు భారీగా పెరిగాయి. మార్కెట్‌లో పెరిగిన ధరలకు అనుగుణంగా పత్తికి కూడా రూ.15 వేలు ధర చెల్లించాలి.

ఎత్తిపోతల డెలివరీ పాయింట్ సందర్శన



నవతెలంగాణ-దండేపల్లి

మండలంలోని తానిమడుగు వద్ద గల గూడెం ఎత్తిపోతల పథకం డెలివరీ పాయింట్ 30వ డిస్ట్రిబ్యూటరిని ఆదివారం మంచిర్యాల అదనపు కలెక్టర్ మదుసుధన్ నాయక్ సందర్శించారు. ఎత్తిపోతల పథకం రెండు మోటర్లు నడుస్తున్నయా లేదా అని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా నిరంతరం నీటి సరఫరా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎత్తిపోతల పథకం ద్వారా వచ్చే నీరు కింది ప్రాంత రైతులకు అందేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా ఎత్తిపోతల పథకం నీరు 30వ డిస్ట్రిబ్యూటరీ నుంచి పైకి వెళ్లకుండా చూడాలని అన్నారు. ఎగువన గల రైతులకు కడెం ప్రాజెక్టు నుండి నీటిని విడుదల చేసినట్లు ఆయన తెలిపారు. రైతులు సమయం పాటించి అధికారులకు సహకరించాలని ఆయన కోరారు. ఎత్తిపోతల పథకంలో సాంకేతిక లోపం వల్ల కొంత ఇబ్బందులు ఎదురయ్యాయని ఇకముందు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు అందించేందుకు కృషి చేస్తామని అన్నారు. ఆయనవెంట ఆర్డీఓ వేణు ఉన్నారు.

వసతి గృహాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి

- కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో సంక్షేమ, గురుకుల, ఆశ్రమ, కస్తూరిబా పాఠశాలలో చదువుకుంటున్న విద్యార్థుల సౌకర్యాల మీద జిల్లా అధికారులకు పట్టింపు లేదని విద్యార్థులకు కనీస సౌకర్యాలు కల్పించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి దుర్గం దినకర్ డిమాండ్ చేశారు. జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత మూడు నెలల క్రితం ఓకే నెలలో ముగ్గురు విద్యార్థులు అనారోగ్యంతో చనిపోయారని అయినప్పటికీ జిల్లాలో పని చేస్తున్న అధికారులు తాత్కాలికంగా తనిఖీలు చేసి వదిలేసారని ఆరోపించారు. అప్పటి నుంచి సంక్షేమ హాస్టల్‌లలో చదువుకుంటున్న విద్యార్థుల సౌకర్యాలు ఎలా ఉన్నాయో పట్టించుకోవటం లేదన్నారు. రెండు రోజుల క్రితం తిర్యాని హాస్టల్‌లో కలుషిత నీరుతాగి విద్యార్థులు అస్వస్థతకు గురి కావడం జరిగిందని అన్నారు. జిల్లా కేంద్రంలోని హాస్టల్‌ను జడ్జి సందర్శించిన సందర్భంలో అపరిశుభ్రంగా ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసినట్లు పత్రికల్లో కూడా వచ్చిందని జిల్లా కేంద్రంలోనే పాఠశాలల పరిస్థితి ఇలా ఉంటే ఇక మారుమూల ప్రాంతాలలో ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చని అన్నారు. జిల్లాలో రెబ్బెన కేజీబీవీలో మెను ప్రకారం భోజనం పెట్టడం లేదని ఆ మండల జడ్పీటీసీ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అసహనం వ్యక్తం చేయడం పరిస్థితి అద్దం పడుతుందన్నారు. వెంటనే జిల్లా కలెక్టర్ చొరవ తీసుకొని విద్యార్థుల తల్లితండ్రులతో సంక్షేమ అధికారులతో విద్యార్థి ప్రజా సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థుల ఆరోగ్యం పట్ల అధికారులు శ్రద్ధ తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్‌ఐ జిల్లా నాయకులు దుర్గం రాజ్ కుమార్, గెడం టీకానంద్ పాల్గొన్నారు.

ఘనంగా పాఠశాల వార్షికోత్సవ వేడుకలు



నవతెలంగాణ-నస్పూర్

మున్సిపాలిటీ పరిధిలోని మదర్స్ ఫ్రైడ్ ప్లే స్కూల్ ఐదవ వార్షికోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంచిర్యాల ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ప్రస్తుత కాలానికి అనుకూలంగా తల్లిదండ్రుల మార్పుతోపాటు ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలు ప్లేవే విధానంలో విద్యను బోధించడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వివిధ క్రీడల్లో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులను అందజేశారు. వేడుకల్లో నిర్వహించిన వివిధ సంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థులు తల్లిదండ్రులు కలిసి నృత్యాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, మండల విద్యాధికారి రోశయ్య, మున్సిపాలిటీ చైర్మన్ ప్రభాకర్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు సుబ్బయ్య, సాయిబాబా టెంపుల్ చైర్మన్ మల్లెత్తుల రాజేంద్రపాని, కౌన్సిలర్లు సంధ్యారాణి రామ్మూర్తి, బేర సత్యనారాయణ, పూదరి కుమార్, బండి పద్మ, భౌతు లక్ష్మి, పాఠశాల ప్రిన్సిపల్ రామకృష్ణారెడ్డి, కరస్పాండెంట్ రేగళ్ల ఉపేందర్, డైరెక్టర్లు సాంబశివారెడ్డి, విష్ణు రెడ్డి, ఇన్‌ఛార్జి స్వదీప్తి పాల్గొన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

- బీఎస్‌పీ సిర్పూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి హర్షద్‌హుస్సేన్



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

ముందస్తు అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని బీఎస్‌పీ నియోజకవర్గ ఇన్‌చార్జి హర్షద్ హుస్సేన్ అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో బీఎస్‌పీ రాష్ట్ర కార్యదర్శి సిడాం గణపతితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆదివారం నిర్వహించ తలపెట్టిన ఆదివాసీ సదస్సును అడ్డుకునేందుకు పోలీసులు ముందస్తు అరెస్టులు చేయటం అప్రజాస్వామికమని అన్నారు. శాంతియుతంగా సదస్సును నిర్వహిస్తే సమస్య ఏమిటని వారు ప్రశ్నించారు. జిల్లాలో 30 యాక్టు అమల్లో ఉందని, అధికార పార్టీ నాయకులు గ్యాస్ ధర పెంపుపై నిరసన తెలిపితే వారికి వర్తించని యాక్టు ప్రతిపక్ష సభ్యులకు మాత్రం వర్తిస్తుందా అని అన్నారు. నూతన సవరణ నియమాలు, అటవి హక్కుల చట్టం 2006 దాని నియమాలు ఆదివాసీ హక్కులకు సంబంధించన 170 చట్టాలు ఉల్లంఘిస్తాయని, వీటి అమలును ఆపాలని వారు డిమాండ్ చేశారు. పోడుభూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని, అటవి హక్కుల రక్షణ కోసం ఐక్యంగా ఉద్యమిస్తామన్నారు. అధికార పార్టీ నాయకులు భూ కబ్జాలు చేస్తున్నారని, పోలీస్ రెవెన్యూ అధికారులు అదికార పార్టీకి కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ఏ కార్యక్రమాలు చేపట్టిన సమాచారం లేకుండా పోరాటాలు చేస్తామన్నారు. ముందస్తు అరెస్టయిన వారిలో బీఎస్‌పీ జిల్లా అధ్యక్షుడు మోర్లె గణేష్, సిర్పూర్ నియోజకవర్గ అధ్యక్షుడు రాంప్రసాద్, కాగజ్‌నగర్ పట్టణధ్యక్షుడు నక్క మనోహర్, జిల్లా ప్రధాన కార్యదర్శి దుర్గం ప్రవీన్, బీఎస్‌పీ బెజ్జూర్, పెంచికల్‌పేట్ మండలాధ్యక్షులు ఆత్రం సాయి, పాగిడె ఆశన్న, మైనార్టీ సెల్ అధ్యక్షుడు ముక్తార్ రోహి, కుమురంభీం అంబేద్కర్ యువజన సంఘం జిల్ల అధ్యక్షుడు తోట సతీష్ ఉన్నారు.

అరెస్టు చేసినవారిని విడుదల చేయాలి

కాగజ్‌నగర్ పట్టణంలో ఆదివారం నిర్వహించనున్న ఆదివాసీ జిల్లా సదస్సుకు వచ్చే ఆదివాసీ నాయకులను, దళిత సంఘాల నాయకులను ముందస్తుగా అరెస్టు చేయటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని గోండ్వాన ఆదివాసీ సంఘం జిల్లా అధ్యక్షుడు తలండి మధూకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అక్రమంగా అరెస్టు చేసిన ఆదివాసీ దళిత నాయకులను బేషరతుగా విడుదల చేయాలని, ఆదివాసులను ఆక్రమణ దారులుగా చిత్రీకరించిన సీఎం కేసీఆర్ వైఖరికి నిరసనగా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన అటవి సంరక్షణ నియమాలను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ సదస్సు నిర్వహించడానికి ఏర్పాట్లు చేయగా ఆదివారం ఉదయం ఆదివాసీ దళిత సంఘాల కార్యకర్తలను అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడం దుర్మర్గామైన చర్య అన్నారు. 1/70 చట్టం పేసా చట్టం 5వ షెడ్యూల్ 2006 అటవి హక్కుల చట్టాన్ని కాలరాస్తున్నారని, అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని, ఉద్యమాన్ని మరింత బలోపేతం చేయడానికి అన్ని ఆదివాసీ సంఘాలు దళిత సంఘాలతో పెద్దఎత్తున ఉద్యమిస్తామని ఆయన తెలిపారు.

చెరువు కబ్జాదారులను శిక్షించాలి



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని తపాల్పూర్ గ్రామం సింగరాయపేట గ్రామ శివారులోని చెరువు భూమిని అధికార పార్టీ ప్రజాప్రతినిధులు కబ్జా చేశారని, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బోర్లకుంట ప్రభుదాస్, ప్రధాన కార్యదర్శి ఫసీఉల్లా డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పొన్కల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్, తపాల్పూర్ సర్పంచ్ తమ కొడుకుల మీద దొంగ చాటుగా కబ్జా చేసుకుని దొంగ పట్టాలు పొంది, అట్టి భూమిపై బ్యాంకులో రుణాలు కూడా పొందడం జరిగిందన్నరు. సర్వే నెంబర్ 147/11లో రెండు ఎకరాలు 20 గుంటలు, సర్వే నెంబర్ 147/76లో ఐదు ఎకరాలు కబ్జా గురైందన్నరు. వీరిద్దరిని వెంటనే పదవుల్లోంచి సస్పెండ్ చేసి కఠినమైన చర్యలు తీసుకోవాలన్నరు. ఈ కబ్జాదారుల వెనుక ఏ అధికారుల హస్తముందో వాళ్లపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం అన్నారు. సమావేశంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జి.మోహన్ రెడ్డి, సీనియర్ నాయకులు ముత్యం రాజన్న, పట్టణ అధ్యక్షులు దుమాల రమేష్, ప్రచార కార్యదర్శి ఎండీ అజర్, బీసీ సెల్ అధ్యక్షులు రాజన్న యాదవ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మామిడిపల్లి ఇందయ్య, వార్డ్ మెంబర్ గంగన్న యాదవ్, టీసీ సెల్ ప్రధాన కార్యదర్శి బొంతల లక్ష్మణ్, యువజన కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్ పాల్గొన్నారు

అవినీతి రహిత సమాజ నిర్మాణమే లక్ష్యం

- యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ ఫౌండర్ తల్నాటి రాజేంద్ర
- బీబ్రా గ్రామాభివృద్ధి పనులు పరిశీలించిన సంస్థ సభ్యులు



నవతెలంగాణ-దహెగాం

గ్రామీణ ప్రాంతాల రూపురేఖలు మార్చి అవినీతి రహిత సమాజ నిర్మాణమే తమ లక్ష్యమని యూత్‌ఫర్ యాంటీ కరప్షన్ ఫౌండేషన్ సంస్థ(హైదరాబాద్) ఫౌండర్ తల్నాటి రాజేంద్ర అన్నారు. ఆదివారం మండలంలోని బీబ్రా గ్రామ పంచాయతీని సంస్థ సభ్యులతో కలిసి అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని రంగాల్లో తనకంటూ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని దక్కించుకున్న బీబ్రా గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలపై ప్రత్యేక డాక్యుమెంటరీ రూపొందించి ప్రపంచానికి తెలియజేయడానికి కృషి చేస్తామన్నారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలను గతంలోనే పరిశీలించి 2022 సంవత్సరంలో ఉత్తమ సర్పంచ్‌గా హైదరాబాద్ వేదికగా సర్పంచ్ బండ కృష్ణమూర్తిని సత్కరించడం జరిగిందన్నారు. అలాగే ప్రస్తుతం కొనసాగుతున్న పనులు, గ్రామ ప్రత్యేకతలు భవిష్యత్తులో పూర్తిస్థాయిలో గ్రామ రూపురేఖలు మారిపోవడానికి కావాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో పురాతన పోలీస్‌స్టేషన్, స్వాంత్రంత్ర్య ఉద్యమం కాలంనాటి జెండా గద్దె, పల్లె ప్రకృతివనంలను పరిశీలించడంతో పాటు దేవాజీగూడ గ్రామంలో ఫ్లోరైడ్ వాటర్ సమస్యతో గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారనే సమాచారం తెలుసుకొని అక్కడికి వెళ్లి పరిస్థితులను అడిగి తెలుసుకోవడం జరిగిందన్నారు. గ్రామ స్వరాజ్యంతోనే దేశాభివృద్ధి సాధ్యం అన్న గాంధీజీ ఆలోచన మేరకు యూత్‌ఫార్ యాంటికరప్షన్ సంస్థ దేశంలో వినూత్న కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందన్నారు. అవినీతి రహిత గ్రామాలుగా పేరుగాంచిన గ్రామాలను ఎన్నుకొని వాటి అభివృద్ధి కోసం కావాల్సిన సహాయ సహకారాలు అందించడం జరుగుతుందన్నారు. బీబ్రా గ్రామానికి సైతం అదే ఉద్దేశ్యంతో వచ్చామని, గ్రామాభివృద్ధి కోసం సహాయ సహకారాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో యూత్‌ఫ యాంటికరప్షన్ జాతీయ సభ్యులు మారియా ఆంటోని, హరిప్రకాష్, ఈశ్వర్‌తో పాటు గ్రామ సర్పంచ్ బండ కృష్ణమూర్తి, పంచాయతీ కార్యదర్శి సుమలత పాల్గొన్నారు.

మహిళలు పురుషులతో సమానంగా పోటీపడాలి

- జడ్పీ చైర్‌పర్సన్ కోవలక్ష్మి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు పురుషులతో సమానంగా పోటీ పడాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవలక్ష్మి అన్నారు. జిల్లా కేంద్రంలో వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం పురస్కరించుకొని 'ఆరోగ్యవంతమైన మహిళ ఆరోగ్యవంతమైన ఇండియా' అనే నినాదంతో నిర్వహించిన సైక్లింగ్ ర్యాలీనీ జిల్లా వైద్యాధికారి రామకృష్ణతో కలిసి జండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంతో పోలిస్తే మహిళలు మెరుగైనప్పటికీ మరింత ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో జిల్లా వైద్యాధికారి రామకృష్ణ మాట్లాడుతూ సమాజంలో మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. దీని కోసం ఏఎన్‌ఎం, ఆశ వర్కర్లు పనిచేయాలన్నారు. వైద్య శాఖలో పనిచేసే మహిళలకు అన్ని విధాలా అండగా ఉంటామని తెలిపారు. సమాజంలో వచ్చే ఒడిదుడుకులను తట్టుకుంటూ మహిళలు ముందుకు సాగాలని అప్పుడే అనుకున్న లక్ష్యాలు సాధించే అవకాశం ఉంటుందన్నారు. అంతకుముందు మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తమకు ఉత్తమ అవార్డు అందజేయాలని ఏఎన్‌ఎం ఆశలు జిల్లా పరిషత్ చైర్పర్సన్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి సుధాకర్ నాయక్ పాల్గొన్నారు.

ప్రశాంతంగా కాలేజ్ ఆఫ్ ఎక్స్ లెన్స్ ప్రవేశపరీక్ష

నవతెలంగాణ-ముథోల్



మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఆదివారం నిర్వహించిన కాలేజ్ ఆఫ్ ఎక్స్ లెన్స్2023-24 ప్రవేశపరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశానికి నిర్వహించిన ఈపరీక్షకు 483 మంది విద్యార్థులకు గాను 433 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకాగా 50 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ప్రిన్సిపాల్ రఫీఉద్దీన్ తెలిపారు. 24 మంది విద్యార్థులకు ఒక ఇన్విజిలేటర్ చొప్పున మొత్తం 21 మంది ఇన్విజిలేటర్‌ల తోపాటు డిపార్ట్మెంట్ ఆఫీసర్‌గా ప్రేమ్ కుమార్ విధులు నిర్వహించారు. జిల్లాలోని ఆయా ప్రాంతాల నుండి విద్యార్థులు తమ పోషకులతో పరీక్ష కేంద్రానికి గంట ముందే హాజరయ్యారు.

అనుదినం జనస్వరం
నవతెలంగాణ
www.navatelangana.com
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
సోమవారం 06 మార్చి 2023

అంతర్జాతీయ మహిళాదినోత్సవ వేడుకలు

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని అంకోలి గ్రామంలోని రైతు వేదికలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఆదివారం మహిళలకు చట్టాలపై అవగాహన కల్పించారు.జిల్లా సెషన్స్ జడ్జి ఎంఆర్ సునీత ముఖ్య అతిథిగా హాజరై మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎల్ఎస్ఏ ఆదిలాబాద్ చైర్మన్ మాధవి కృష్ణ, జిల్లా జడ్జి క్షమా దేశపాండే, డీఎస్ఎస్ఏ కార్యదర్శి యశ్వంత్ సింగ్ చౌహాన్, ఎం న్యాయవాది రమణారెడ్డి, సర్పంచ్ ఇటికల భూమన్న, మాజీ ఎంపీటీసీ వెంకట్ రమణ, పంచాయతీ కార్యదర్శి ఖదీర్, రూరల్ ఎస్సై నాగనాథ్ పాల్గొన్నారు.

కళకళలాడుతున్న తాటివనం..!

ఈజ్‌గాం తాటికల్లుకు యమాక్రేజ్



నవతెలంగాణ - కాగజ్‌నగర్ రూరల్

హలో గౌడ్ సాబ్ నమస్తే... ఇయ్యాల మా దోస్తులత్తన్లు... పొద్దాటి కల్లు ఉంచు... కల్లు మాత్రం గుమ్మండాలే... కల్లు సూపరుంటుందన్నా... ఇది పొద్దాల్ల కల్లు... తాగినంక నువ్వే అంటవ్ మస్తున్నదని.... ఇట్లుంటది మండువలల్ల ముచ్చట్లు... ఎండాకాలం ప్రారంభం కావడంతో మండలంలోని ఈజ్‌గాం తాటివనం కల్లు ప్రియులతో కళకళలాడుతోంది. కాగజ్‌నగర్ పట్టణానికి కేవలం ఐదు కిలో మీటర్ల దూరంలో ఉండడంతో పట్టణంతో పాటు మండలంలోని పలు గ్రామాలకు చెందిన తాటికల్లు ప్రియులు పొద్దుమాపు ఇక్కడ కల్లు తాగుతూ సేదతీరుతున్నారు.

మండలంలోని ఈజ్ గాం తాటివనంలో సుమారు 250 తాటి చెట్లు ఉండగా 30 మంది గీత కార్మికులు కల్లు గీస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతం కావడంతో ప్రమాదాలకు గురైన గీత కార్మికులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి సాయం అందని దుస్థితి నెలకొంది. ఈ చెట్లను సంవత్సరానికి ఒక సారి ఇక్కడి కార్మికులే వేలం నిర్వహిస్తారు. స్థానిక గౌడ కులస్తులే యూనిటీగా ఏర్పడి వేలం ద్వారా చెట్లను దక్కించుకుంటారు. ప్రతీ సంవత్సరం సెప్టెంబర్‌లో వేలం నిర్వహించి వచ్చిన చెట్లకు కల్లు గీసి ఆదాయం పొందుతారు. ప్రస్తుతం ఎండాకాలం కావడంతో మండువలన్నీ కళ్ల ప్రియులతో సందడిగా మారుతున్నాయి. గౌడన్నలు ఉదయాన్నే తాళ్లు ఎక్కకముందే ఫోన్‌లో బుకింగ్ ప్రారంభిస్తారు. ఆదివారం, మంగళవారం ఐతే పొద్దుగాల వరకే కల్లు మొత్తం పోన్లలన్నే బుకింగ్ అవడంతోపాటూ అమ్ముడుపోతుంది. సెలవు రోజుల్లో అయితే మండువలల్ల జాతరలాగా జనాలు ఉంటున్నారు. ఇంగ్లీష్ మందు ఆరోగ్యానికి హానికరం కావడంతో అంతో ఇంతో ఔషదగుణాలున్న కల్లు కావడంతో జనాలు ఆసక్తి చూపిస్తున్నారు.

వడగల్లుకు బాగా గిరాకీ

పోద్దాటి చెట్టుకు ప్రత్యేకంగా వడ కల్లు పారుతుంది. బీరు, విస్కీ తాగి ఆరోగ్యాన్ని చెడగొట్టుకునే కంటే తాటి కల్లు తాగి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలనే ఉద్దేశంతో యువత తాళ్ళబాట పడుతున్నారు.

చెట్టు రకాన్ని బట్టి కల్లుకు పేరు

తాటి చెట్లలో ఆడ, మగ చెట్లు ఉంటాయి. నాపతాడు, పరుపు తాడు, పండు తాడులను ఆడ చెట్లుగా, పోద్దాళ్లను మగ చెట్లుగా పిలుస్తారు. సంవత్సరానికి నాలుగు సీజన్లుగా విడదీసి కల్లు గీస్తారు. తాటిచెట్లు అన్ని కాలాల్లోనూ కల్లు ఇవ్వవు. ఒక్కో కాలంలో ఒక్కో రకం తాటిచెట్టు కల్లు ఇస్తుంది. అందుకే ఏ కాలంలో కల్లు ఇచ్చే చెట్టును ఆ కాలంలో ఉపయోగించుకుని ఏడాది అంతా కల్లును గీస్తూ బతుకుతుంటారు గీతకార్మికులు. మూడు కాలాల్లో కల్లు పారే చెట్లకు మూడు రకాల పేర్లు ఉంటాయి. అందులో ఒకటి 'పొద్దాడు'. దీన్నే మగ తాటిచెట్టు అంటారు. దీనికి గులకల గెలలు మాత్రమే ఉంటాయి. ముంజకాయల గెలలు ఉండవు. ఈ చెట్టుకు డిసెంబర్ చివర్లో కల్లు పారటం ప్రారంభమై మార్చి వరకు కొనసాగుతుంది. దీని కల్లు తాగితే బలం వస్తుందని అంటారు. రెండో తాడిచెట్టు పేరు 'పరుపుతాడు'. దీన్నే ఆడ తాటి చెట్టు అంటారు. దీన్ని మార్చి నుంచి జూన్ వరకు కల్లు గీస్తారు. ఈ చెట్టు కల్లు తాగితే ఒళ్ళు నొప్పులు పోతాయని, చలువ చేస్తుందని నమ్ముతారు. ఇక మూడో రకం తాడు 'పండుతాడు'. అంటే ముసలి తాటి చెట్టు అని అర్థం. ఇది జూన్ నుంచి డిసెంబర్ వరకు కల్లు పారుతుంది.



కొన్ని వ్యాధులకు ఔషదంగా

తాటి కల్లుతో జీర్ణకోశవ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు నయమవుతాయని ప్రజల విశ్వాసం. కిడ్నీల్లో రాళ్లను తొలగిస్తుందని నమ్ముతారు. పోద్దాడు, పండుతాటి కళ్లు బాలింతలకు మంచిదని చెబుతుంటారు. తెల్లవారుజామున తీసే కల్లును 'నీరా' అంటారు. ఈ నీరా తాగితే నిషా సోకదు. ఎండాకాలంలో ప్రధానంగా ఉదయాన్నే కల్లు గీస్తారు. దీన్ని పొద్దుటి కల్లు అంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పొద్దునే ఈ కల్లు తాగి ఎండదెబ్బ నుంచి కాపాడు కుంటారు. దీనిలోని అనేక ఔషధ గుణాలు దేహానికి ఎంతో మేలు చేకూరుస్తాయంటారు.



స్వచ్ఛతా ఆరోగ్యం

పూదరి వెంకటేష్‌గౌడ్



తాటి కల్లు స్వచ్ఛమైనదీ ఆరోగ్యకరమైనది. కల్లుతో జీర్ణకోశవ్యాధులు, కిడ్నీ సంబంధిత వ్యాధులు నయమవుతాయి. కిడ్నీల్లో రాళ్లను తొలగించుకునేందుకు ఉపయోగపడుతుంది. తెల్లవారుఝామున తీసే 'నీరా' కల్లు తీయగా ఉంటుంది. ఇది తాగితే జీర్ణకోశవ్యాధులు దూరమవుతాయి. ఎండదెబ్బనుంచి కాపాడుకునేందుకు కల్లు ఎంతగానో ఉపయోగపడుతుంది. కల్లులోని అనేక ఔషధ గుణాలు దేహానికి ఎంతో మేలు చేకూరుస్తాయి.

కల్లుతోనే ఉపాధి

బండి వెంకన్న



దశాబ్దాలుగా కల్లుగీతతోనే ఉపాధి పొందుతున్నా. కాలానికి అనుగుణంగా వచ్చే కల్లు ఒక్కో సీజన్‌లో ఒక్కోలా ఉంటుంది. కల్లు కోసం వచ్చేవాళ్ళు ముందుగానే ఫోన్‌లో సంప్రదించి వస్తున్నారు. కల్లుకు అనుగుణంగా ఫోన్‌లో బుకింగ్ చేసుకుంటారు.

నోటిఫైడ్ లో ఉన్నా ప్రభుత్వ సాయం అందించాలి

సిరిశెట్టి శ్రీనివాస్ గౌడ్



ఈజ్ గాం గ్రామం నోటిఫైడ్ ఏరియా కావడంతో ఇక్కడ గీత కార్మికులకు ఎలాంటి సదుపాయాలు అందని దుస్థితి. చెట్లు ఎక్కే క్రమంలో గాయాలపాలైన, మృతి చెందిన గీత కార్మికులకు వైద్యసదుపాయం, బీమా కల్పించి ప్రభుత్వం ఆదుకోవాలి.

మనువాద దాడికి వ్యతిరేకంగా పోరాడాలి



నవతెలంగాణ-ఖానాపూర్

మహిళలపై మనువాద దాడికి వ్యతిరేకంగా ప్రతి ఒక్క మహిళ పోరాడాలని పీఓడబ్ల్యూ జిల్లా ప్రధాన కార్యదర్శి కట్ల లక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవంలో భాగంగా ఆదివారం పట్టణంలోని విద్యానగర్ కాలనీలో సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళను ఉద్దేశించి ఆమె మాట్లాడుతూ పాసిస్టు ప్రమాదం అన్ని రంగాలను, అన్ని వర్గాలను ముంచేత్తుతుందన్నారు. సైన్స్ స్థానంలో అశాస్త్రీయ భావాలను జ్యోతిష్య శాస్త్రాన్ని, మనువాద భావజాలాన్ని ప్రవేశపెడుతున్నారని అన్నారు. లవ్ జిహాద్, గర్ వాపసి, హలాల్, హిజాబ్, పౌరసత్వ చట్టం తదితర పేర్లతో మైనార్టీలపై దాడులకు హత్యలకు పూనుకుంటుదని అన్నారు. దళితులపై మైనారిటీలపై జరుగుతున్న దాడులు, హత్యలు పాసిస్టు చర్యల్లో భాగమేనని అందుకే ముంచుకొస్తున్న పాసిస్టు ప్రమాదంపై మహిళలపై మనువాద దాడికి వ్యతిరేకంగా మహిళా దినోత్సవ స్ఫూర్తితో పోరాడాలని అన్నారు. ఢిల్లీ సరిహద్దుల్లో రైతాంగం సాధించిన ఉద్యమ విజయం ప్రేరణతో మహిళలు ఉద్యమ బావుట ఎగరవేయాలని, కేంద్ర ప్రభుత్వ మతోన్మాద మనువాద విధానాలకు వ్యతిరేకంగా, సంఘటిత సమైక్య ఉద్యమానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జాయింట్ సెక్రటరీ డి మలాక్క, భీమక్క, స్రవంతి, లక్ష్మి పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి అండగా దివ్యశ్రీ ఫౌండేషన్

నవతెలంగాణ-నార్నూర్

ఆపదలో ఉన్న నిరుపేద కుటుంబానికి సహాయం సహకారాలు అందించడానికి ఎల్లపుడూ దివ్యశ్రీ ఫౌండేషన్ అండగా ఉంటుందని ఆ ఫౌండేషన్ చైర్మన్ దారావత్ ప్రవీణ్ నాయక్ అన్నారు. ఆదివారం మండలంలోని మలంగి గ్రామానికి చెందిన పుసం గిరిజబాయి సోము దంపతుల పూసం సోము మలంగి సర్పంచ్ కుమారుడు తులసిరామ్ పెళ్లి శుభకార్యానికి సంబంధించిన రూ.86 వేల విలువగల బట్టలు, కిరాణ ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. సహాయం అందించిన ఆయనకు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రవీణ్ నాయక్ మాట్లాడుతూ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కులాలకతీతంగా నిరుపేద కుటుంబాలకు చెందిన పెళ్లి శుభకార్యాలకు, వదు వరుల కుటుంబానికి తన వంతుగా సహాయం చేస్తున్నట్లు తెలిపారు. ఆడబిడ్డల వివాహాలకే కాకుండా చదువుపై ఆసక్తి కలిగి ఆర్థిక స్తోమత లేని నిరుపేద విద్యార్థులకు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి, అత్యవసర పరిస్థితుల్లో ఆదిలాబాద్ రిమ్స్ హాస్పిటల్ నుండి హైదరాబాద్ ఆసుపత్రికి వెళ్లడానికి అంబులెన్స్ సౌకర్యం కల్పించి రోగులను ఆసుపత్రికి చేరవేస్తున్నామన్నారు. కార్యక్రమంలో దివ్యశ్రీ ఫౌండేషన్ సభ్యులు రోహిదాస్, సురేష్, మధు పాల్గొన్నారు.

బండి సంజయ్ దిష్టిబొమ్మ దహనం

నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

పార్టీ నిర్మాణంలో భాగంగా జిల్లాకు వచ్చిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ భారత జాగృతి అధ్యక్షురాలు కవితపై చేసిన ఆరోపణలను నిరసిస్తూ భారత జాగృతి ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక తెలంగాణ చౌక్‌లో బండి సంజయ్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా జాగృతి జిల్లా అధ్యక్షుడు రంగినేని శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రపంచ దేశాలు పొగిడేలా నేడు తెలంగాణలో అభివృద్ధి జరుగుతోందని అన్నారు. దేశవ్యాప్తంగా కేసీఆర్, కేటీఆర్, కవితకు ఆదరణ మరింత పెరిగింది అన్నారు. బండి సంజయ్ మతతత్వ రాజకీయాలు చేస్తూ అల్లర్లకు ఉసిగొలుపుతున్నారన్నారు. తన కుమారుడి ర్యాగింగ్ ఉదంతం ఇంకా కళ్ళముందే మెదులుతుందని గుర్తు చేశారు. మహిళా రక్షణకు ప్రత్యేక షీ టీంలను ఏర్పాటు చేసి మహిళా ఆత్మ గౌరవాన్ని కాపాడిన ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వం అన్నారు. మరోసారి అసత్య ప్రచారాలకు పాల్పడితే పుట్టగతులు ఉండవని హెచ్చరించారు. కార్యక్రమంలో భారత జాగృతి నాయకులు గోలి శంకర్, స్వరూపరాణి, బోడిగం మమత, పర్వీన్ పాల్గొన్నారు.

మంత్రిపై అసత్య ప్రచారాలు మానుకోవాలని

నవతెలంగాణ-నిర్మల్

మంత్రి ఇంద్రకరణ్ రెడ్డిపై అసత్య ప్రచారాలు మానుకోవాలని మున్సిపల్ చైర్మన్ గండ్రత్ ఈశ్వర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్, బీజేపీ నాయకులు ఉదయం లేస్తే మంత్రిపై ఏదో ఒక ఆరోపణ చేస్తూ వాళ్ల ఉనికి కాపాడుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. మచ్చ లేని మనిషి ఇంద్రకరణ్ రెడ్డి అని కొనియాడారు. కరోనా సమయంలో నిర్మల్‌లో ఇంటింటికి తిరుగుతూ ప్రజలకు ధైర్యాన్ని నింపారన్నారని గుర్తు చేశారు. నిర్మల్ పట్టణం నియోజకవర్గంలో మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి చేసిన అభివృద్ధి కనిపిస్తాలేదాని ప్రశ్నించారు. మెడికల్ కాలేజ్, కలెక్టర్ భవనం, జిల్లా ప్రధాన ఆస్పత్రి, రోడ్లు, అభివృద్ధి పనులు ఎవరు చేశారో నిర్మల్ ప్రజానీకానికి తెలుసని, ప్రజలందరూ మంత్రి వెంట ఉన్నారని తెలిపారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమానికి బీఆరెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు. ఆరోపించడం కాదని, దమ్ముంటే ఆధారాలతో రుజువు చేయాలని సవాలు విసరారు. సమావేశంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు మారుగొండ రాము, మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక రమణ, మైనారిటీ నాయకులు నజీరోద్దిన్, సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు అఖిల్ రెబల్, దేవరకోట డైరెక్టర్ నెల్ల అనిల్ పాల్గొన్నారు.

అరకొర వైద్య సేవలతో ప్రజల్లో అసంతృప్తి



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

రాష్ట్రంలో అరకొర వైద్య సేవలతో ప్రజల్లో అసంతృప్తి నెలకొందని రైట్ టు హెల్త్ ఫోరం, ఆర్టిహెచ్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు మోతె రాజలింగు అన్నారు. పట్టణంలోని స్థానిక రాజీవ్ చౌరస్తాలో ఆదివారం ఫోరం పట్టణ అధ్యక్షుడు పోతుల మురళీకృష్ణ, మోతె రాజలింగు ఆధ్వర్యంలో ప్రజారోగ్యంపై అవగాహన కల్పించి, కరపత్రాలను ఆవిష్కరించారు. అనంతరం మోతె రాజలింగు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆరోగ్య పథకాలు ఆయా పార్టీల ప్రచారస్త్రాలుగా కావడంతో పేదలకు మెరుగైన వైద్యం అందడం లేదని ఆయన ఆరోపించారు. ప్రభుత్వాసుపత్రుల్లో వైద్య సిబ్బంది కొరత తీవ్రంగా ఉందని, ఆధునిక వైద్య సదుపాయాలను వినియోగించుకునే వెసులు బాటు లేదన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజారోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని వారు కోరారు. కార్యక్రమంలో ఫోరం నాయకులు చింత మధుబాబు, పూదరి సతీష్ కుమార్, మంద రవి, దోమల తిరుపతి, రామన్న రాజన్న పాల్గొన్నారు.

మద్యానికి బానిసై ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-నస్పూర్

మద్యానికి బానిసై ఉరివేసుకొని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మున్సిపాలిటీ పరిధిలోని తాళ్లపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. శ్రీరాంపూర్ ఎస్సై మానస తెలిపిన వివరాల ప్రకారం.. అగ్గు సుధాకర్ (43) కూలి పని చేస్తూ జీవనం సాగించేవాడు. ఇటీవల మద్యానికి బానిసై కుటుంబ పోషణ భారం అవడంతో మనస్థాపానికి గురై శనివారం రాత్రి ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం కుటుంబ సభ్యులు చూసేసరికి చనిపోయి ఉన్నాడని పోలీసులకు సమాచారం అందించారు. భార్య వనిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

క్రికెట్ పోటీలు ప్రారంభించిన ఎంపీపీ

నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్



మండలంలోని లండసాంగి గ్రామంలో ఆదివారం క్రికెట్ పోటీలను ఎమపీపీ గంద్రత్ రమేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జోగు ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జోగు రామన్న సహకారంతో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. క్రీడల వల్ల మానసిక ఉల్లాసం స్నేహభావంతోపాటు శరీర దృఢత్వం అలవర్చుకోవచ్చన్నారు. యువత చదువుతోపాటు ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ పోటీలలో రాణించాలన్నారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని అన్నారు. కార్యక్రమానికి ఏఎంసీ చైర్మన్ కుమ్ర విజయలక్ష్మి రాజు, డీసీసీబీ డైరెక్టర్ పరమేశ్వర్, అత్మ చైర్మన్ జిట్ట రమేష్. ఏఎంసీ వైస్ చైర్మన్ బొమ్మకంటి రమేష్. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహద్, గ్రామ సర్పంచ్ శ్రీనివాస్, ఉపసర్పంచ్ వినోద్, కోఆప్షన్ సభ్యుడు అరిఫ్, మోతిరం పాల్గొన్నారు.

భూ కబ్జాదారులను ఇంటికి పంపుదాం

నవతెలంగాణ-లక్ష్మణచాంద

అక్రమాలకు పాల్పడుతూ భూ కబ్జాలతో నిర్మల్ జిల్లాను దోచుకుంటున్న మంత్రి అల్లో ఇంద్రకరణ్‌రెడ్డికి వచ్చే ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పాలని ఏఐసీసీ కార్యక్రమాల అమలు కమిటీ చైర్మన్ ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా లక్ష్మణచాందలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. అక్రమార్కాలతో దోచుకొని కడుపులు నింపుకుంటున్నారని, త్వరలోనే ప్రజలు గుణపాటం చేబుతారన్నారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. నిత్యావసరాలు, సిలెండర్ ధరలు పెంచి సామాన్యుని నడ్డి విరుస్తున్నారని మండి పడ్డారు. కంజర్ గ్రామంలోని కొండని ఆక్రమించుకున్నారని, ఇలాగే ఉరుకుంటే గ్రామలను ఇళ్లతో సహా కబ్జా చేస్తారని విమర్శించారు. విద్య ఉపాధి రంగాన్ని పూర్తిగా విస్మరించి యువతకు అన్యాయం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ హయాంలో జరిగిన సంక్షేమ కార్యక్రమల గురించి మాజీ డిప్యూటీ మంత్రి దామోదర రాజానర్సింహా ప్రజలకు వివరించారు. ఓటు అనే అస్త్రాన్ని ఉపయోగించి అక్రమార్కుల పని పట్టాలి అని పిలుపునిచ్చారు. అన్ని విధాలా ప్రజలకు అండగా ఉండే అభ్యర్థిని గెలిపించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ ముత్యం రెడ్డి, మండల అధ్యక్షులు శ్రీధర్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు దొడ్డికింది ముత్యంరెడ్డి, ఉపాధ్యక్షుడు వొద్నల రాజేశ్వర్, యూత్ కాంగ్రెస్ మండలధ్యక్షులు గాండ్ల చిన్నయ్య, భరత్ చౌహాన్ పాల్గొన్నారు.

'ఆరోగ్య మహిళ' కార్యక్రమాన్ని విజయవంత చేయాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్ టౌన్

అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 8 నుంచి ప్రారంభిస్తున్న ఆరోగ్య మహిళా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఇందిరా ప్రియదర్శిని స్టేడియం నుంచి జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి కార్యాలయం వరకు నిర్వహించిన ఆరోగ్య మహిళ కార్యక్రమ అవగాహన సైకిల్ ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన ఆరోగ్య మహిళా కార్యక్రమంపై జిల్లాలో విస్తృత ప్రచారం కల్పించడం జరుగుతుందని అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈ నెల 8 న ఆదిలాబాద్, బోథ్ నియోజక వర్గ కేంద్రాలలో మహిళల కోసం ప్రత్యేకంగా మహిళా వైద్య శిబిరాలను ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. మహిళలు ప్రధానంగా ఎదుర్కునే వివిధ రకాల ఆరోగ్య సమస్యలకు ఆయా వైద్య శిబిరాలలో మహిళా వైద్యులు, సిబ్బంది వైద్యం అందిస్తారన్నారు. మహిళలు ఆరోగ్యాంగా ఉంటేనే కుటుంబంతో పాటు సమాజం ఆరోగ్యాంగా ఉంటుందన్నారు. ఇందులో భాగంగానే ఆరోగ్య మహిళా, ఆరోగ్య తెలంగాణ నినాదంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు తెలిపారు. రానున్న రోజుల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతి మంగళవారం మహిళలకు ప్రత్యేకంగా వైద్య చికిత్సలను అందించనున్నామని, ఈ అవకాశాన్ని మహిళలందరూ సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, జిల్లా యువజన సంక్షేమ అధికారి వెంకటేశ్వర్లు, అదనపు జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారులు డా.సాధన, మనోహర్, గిరిజన క్రీడల అధికారి పార్థసారధి పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ క్రీడాభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



నవతెలంగాణ-ఆదిలాబాద్ అర్బన్

జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ క్రీడాభివృద్ధికి కృషి చేస్తానని ఆ సంఘం నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ సర్వసభ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రీడాకారుల ప్రతిభను ప్రోత్సహించేలా క్రీడలకు అనుగుణంగా పట్టణంలో మున్సిపల్ స్థలాలను గుర్తించి క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్రీడాకారులకు అనుగుణంగా స్టేడియం పనులు పూర్తి చేస్తున్నామన్నారు. జిల్లాలో ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికి తీసి జాతీయస్థాయిలో రాణించేలా వారికి శిక్షణ ఇప్పించి వెయిట్ లిఫ్టింగ్‌లో జిల్లాకు పేరు వచ్చేలా దోహదపడతానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఎన్నికల్లో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా ఆయనను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సర్వసభ్య సమావేశానికి హాజరైన వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు సాయిలు మాట్లాడుతూ జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ అభివృద్ధికి తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అనంతరం ఎన్నికల పరిశీలకులుగా హాజరైన రాష్ట్ర సంఘం సభ్యులు జయపాల్ ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ కోశాధికారి కే. పార్థసారథి, జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ పరిశీలకుడిగా ఇక్బాల్, ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా గుండి మహేష్ పెటా, టీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.స్వామి, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.రాజేష్, జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జి.నాందేవ్, పీఈటీ, పీడీలు బీజీఎస్ రాకేష్, నరసమ్మ, దేవేంద్రిక, రాహుల్ అగర్కర్, మజీద్ పాల్గొన్నారు.